క్లుప్తంగా

ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న ఏఓ మురళీకృష్ణ, సర్పంచ్ రమణ

రేగిడి: రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి గురుగుబెల్లి మురళీ కృష్ణ తెలిపారు. మండలంలోని వన్నలి ఆర్బీకే వద్ద బుధవారం రైతులకు ఎరువులు పంపిణీని ప్రారంభించారు. పూర్తిస్థాయిలో నిల్వలు ఉన్నాయని, ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పంచాయతీ సర్పంచ్ గార రమణ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

225 మందికి వైద్య సేవలు



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

రేగిడి: మండలంలో వన్నలి గ్రామంలో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. రాగోలుకు చెందిన జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. వైద్యులు టి.కల్యాణి, ఎస్.ప్రేమ సుమారు 225 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కొంతమందిని మెరుగైన వైద్యం నిమిత్తం జెమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు పీఆర్‌ఓ కె.శంకర్ తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని సర్పంచ్ గార రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది పి.ఢిల్లీశ్వరి, డి.అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

రేగిడి: మండలంలో ఉంగరాడ గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై రేగిడి ఎస్‌ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి బుధవారం దాడిచేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1400లు నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇంటర్నల్ ఆడిట్ పరిశీలన



ఆడిట్‌ను పరిశీలిస్తున్న ఏసీ చిరంజీవి

రాజాం: డ్వాక్రా సంఘాల పుస్తకాలు ఆడిట్ చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వైకేపీ రాజాం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. మండలంలో వీఆర్‌అగ్రహారంలో నిర్వహిస్తున్న గ్రామైఖ్య సంఘం, స్వయంశక్తి సంఘాల పుస్తకాల ఆడిట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఆడిట్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఆడిట్ ప్రక్రియ జరుగుతోందన్నారు. ఏపీఎం టి.దధి కుమార్, సీసీలు, సీఎఫ్‌లు, వీఓలు పాల్గొన్నారు.

21 నుంచి ఓటర్ల జాబితాల పరిశీలన

రేగిడి: ఓటర్ల జాబితా నుంచి మరణించినవారి పేర్లను తొలగించాలని బూత్ ఆఫీసర్లకు రాజాం ఎన్నికల అధికారి పద్మలత సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 21 నుంచి ఆగస్టు 20 వరకు ప్రతీ గ్రామంలో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలోని పేర్లు పరిశీలించాలన్నారు. అర్హతకలిగిన ఓటర్లను నమోదుచేయడం, ఒకే డోర్ నంబర్‌లో ఉన్న ఓట్లను గుర్తించి నివేదించాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో శాశ్వత నివాసం ఏర్పర్చుకున్న వారి పేర్లు, మరణించినవారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని పేర్కొన్నారు.

గ్రామాల వారీగా ఉపాధి పనులు గుర్తించండి



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను గ్రామాల వారీగా గుర్తించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష నిర్వహించిన ఆయన పనులకు సంబంధించిన అన్ని రికార్డులను పూర్తి స్థాయిలో తయారు చేయాలని తెలిపారు. కొత్త పనులు గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వేతనదారులకు వేతనాల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల పెంపకానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ సుశీల తదితరులు పాల్గొన్నారు.

సేవకులకు సలాం..

ప్రజాసేవే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు, సేవలను చేరవేస్తున్న వలంటీర్లను తమ ఇంటి బిడ్డగా ఆదరిస్తున్నారు. కోవిడ్ విపత్తు సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వారు అందించిన సేవలను యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఫీవర్ సర్వేలు చేయడంతో పాటు కరోనా బారినపడి హోం క్వారంటైన్‌లో ఉన్నవారికి మందులు, ఆహారపదార్థాలు అందించారు. వ్యాక్సినేషన్ విజయవంతం అయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థ సేవలందిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి రాజాం



పాగిరిలో వృద్ధురాలికి దగ్గరుండి కోవిడ్ టీకా వేయిస్తున్న వలంటీర్ (ఫైల్)

ఎక్కడున్నా పింఛన్ తెచ్చి ఇస్తుంటారు



నేను ఎక్కడ ఉన్నా ఒకటో తేదీ రాగానే మా వలంటీర్ రేవతి పింఛన్ తెచ్చి ఇస్తోంది. రెండుసార్లు నేను వేరే గ్రామంలో బంధువుల ఇంటి వద్ద ఉన్నప్పుడు కూడా నాకు పింఛన్ ఆగలేదు. ఇవే కాకుండా మా ఇంటికి వచ్చే ప్రతీ సంక్షేమ పథకాన్ని వలంటీర్ ఎటువంటి ప్రలోభాలు పెట్టకుండా నేరుగా ఇంటికే తెచ్చి ఇస్తున్నారు. వలంటీర్లు లేకుండా ఇన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు నేరుగా అందేవి కాదు.

- కొండ్రి రాములమ్మ, అప్పలఅగ్రహారం, సంతకవిటి మండలం

తక్షణమే స్పందిస్తున్నారు



మాకు ఏ అవసరమైనా వలంటీర్లకే చెబుతున్నాం. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎఫ్‌ఎంసీ, అడంగల్ మ్యుటేషన్ వంటి అన్ని రకాల సేవలు వలంటీర్లు దగ్గరుండి అందిస్తున్నారు. గతంలో కష్టపడినంతగా ఇప్పుడు ఇబ్బందులు పడాల్సిన పనిలేదు. అంతేకాకుండా స్వయంగా ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు.

- శనపతి రాము, పాగిరి, రాజాం మండలం

అన్నీ వారే చూసుకుంటున్నారు..



గతంలో అర్హత ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని పరిస్థితి ఉండేది. ఇప్పుడలా కాకుండా వలంటీర్లే మా ఇంటి వద్దకు వచ్చి మాకు అవగాహన కల్పించి, అర్హత ఉంటే అన్ని ధ్రువపత్రాలను వారే చేయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు.

- వావిలపల్లి రమణమ్మ, గరికిపాడు, సంతకవిటి మండలం

వలంటీర్లతో చక్కని సేవలు



గ్రామాల్లో వలంటీర్లు ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. పింఛనుతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాలు వారి ద్వారానే నేరుగా మాకు అందుతున్నాయి. గతంలో ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేవి కాదు. మధ్యవర్తులు దోచుకునేవారు. ఇప్పుడు అలా కాకుండా ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా వలంటీర్లు సేవలు అందిస్తున్నారు.

- గుడ్ల పద్మ, అప్పలఅగ్రహారం, సంతకవిటి మండలం



విరిగిన కాలితో సుబ్బలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రావణిబాయి(ఫైల్)

విరిగిన కాలితోనే..

మా వార్డుకు సంబంధించిన వలంటీర్ టి.శ్రావణిబాయికి ప్రమాదం జరిగి కుడికాలు విరిగింది. ఆపరేషన్ చేసి కట్టు కూడా వేశారు. వాటిని లెక్కచేయకుండా మాకు ఠంఛన్‌గా పింఛన్ అందించేది. క్లిష్టపరిస్థితుల్లో కూడా మాలాంటి వృద్ధులకు ఇంటికి తెచ్చి పింఛన్ అందించిన వలంటీర్ల సేవాభావం చాలా గొప్పది.

- మండా సుబ్బలక్ష్మి, లచ్చయ్యపేట–1 సచివాలయం, రాజాం

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



లబ్ధిదారునకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎమ్మెల్యే కంబాల, ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని రుషింగి గ్రామంలో బుధవారం పర్యటించారు. సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరించారు. అర్హత ఉండి పథకాలు ఎవరికైనా అందకపోతే వెంటనే తెలియజేయాలన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఎన్నికల హామీలలో 99 శాతానికి పైగా హామీలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామని, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా గడిచిన నాలుగేళ్లలో రూ.3 లక్షల కోట్లను ప్రజలు ఖాతాల్లోకి డీబీటీ విధానం ద్వారా జమ చేశారని వెల్లడించారు. సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు చంద్రబాబు అండ్ కో అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నారని, మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజలను మోసగించేందుకు మరోసారి సిద్ధమవుతున్నారని, వారిని నమ్మొద్దని ప్రజలకు హితవుపలికారు. సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి మనమంతా కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి, వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణ, నాయకులు యలకల అన్నంనాయుడు, యలకల శ్రీనివాసరావు, యలకల వాసునాయుడు, నెయిగాపుల శివరామకృష్ణయ్య, శనపతి సత్యారావు, సాదెం శ్రీరాంమూర్తి, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, డీటీ బూరాడ సుందరరావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

చురుగ్గా ఫీవర్ సర్వే

బాడంగి: మండలంలోని బాడంగి, కోడూరు గ్రామ సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వే బుధవారం చేపట్టారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, జ్వరపీడితుల వివరాలను సేకరించారు. అలాగే వర్షాకాలం నేపథ్యంలో తలెత్తే సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వాడాడ పీహెచ్‌సీ వైద్యులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



జయప్రకాశరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు కుటుంబాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు బుధవారం కలిసి పరామర్శించారు. శ్రీనివాసరావు అన్నయ్య జయప్రకాశరావు అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన మృతదేహాన్ని కూనాయవలసలో స్వగృహానికి తీసుకువచ్చారని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి, భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావును, ఆయన కుటుంబ సభ్యులను కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జయప్రకాశరావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.బాబ్జీరావు, మండల వైస్ ఎంపీపీ, జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి జి.రామారావు, ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న సురక్ష



రేగిడి: తునివాడలో ధ్రువపత్రాలు అందిస్తున్న తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి



రాజాం: ఆగూరులో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అనూష, తదితరులు

రేగిడి, రాజాం, బొబ్బిలి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. రేగిడి మండలంలో తునివాడ, వెంకమ్మపేట గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నాగమణి, తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి పాల్గొని ప్రజలకు ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించారు. రాజాం మండలంలో ఆగూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కోనారి అనూష, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, మండల ప్రత్యేకాధికారి బి.సుధాకరరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు, ఎంపీడీఓ బి.శంకరరావు తదితరులు పాల్గొని లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. బొబ్బిలి మండలంలోని సీహెచ్ బొడ్డవలస గ్రామంలో ఎంపీడీఓ పోతుల రవికుమార్ జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు.

సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శం



కొత్త సచివాలయ భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్‌ల వ్యవస్థలు దేశానికే ఆదర్శమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పిరిడి గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయం–1, 2 భవనాలతో పాటు రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎంపీ, ఎమ్మెల్యే కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థల ద్వారా లంచాలకు తావులేకుండా అర్హులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇటువంటి వ్యవస్థలను పొరుగు రాష్ట్రాలు కూడా అమలు చేసేందుకు ఆలోచన చేస్తున్నాయన్నారు. అనంతరం వారు రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఎంపీపీ ఎస్.లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, సర్పంచ్ టి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నామని ఎంఈఓ–1, 2 తిరుమల ప్రసాద్, పెంటయ్య తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో వారు విలేకరులతో బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, అనేక విద్యాసంస్కరణలు చేపట్టి, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూస్తోందన్నారు.

రూ.69 వేలకు కొబ్బరిచెక్కల వేలం ఖరారు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయంలో కొబ్బరి చెక్కల వేలం పాట ఎట్టకేలకు ఖరారైంది. గతంలో నిర్వహించిన వేలానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో మరోసారి బుధవారం వేలం నిర్వహించారు. బహిరంగ వేలంలో తలతంపర గ్రామానికి చెందిన రాగోలు ఆనందరావు రూ.69,500లకు పాట దక్కించుకున్నట్లు ఈఓ పి.శ్యామలరావు తెలిపారు. ఈ నెల 13 నుంచి 2025 జూలై 14 వరకు దీని కాలపరిమితి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలిపల్లి పైడితల్లి దేవాలయ ఈఓ బీవీ మాధవరావు, ఆలయ ట్రస్టీ వానపల్లి నర్సింగరావు, పర్యవేక్షకులు కూరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ



ఆన్‌లైన్ రిపోర్టులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సంతకవిటి: మండలంలోని కొండగేడేం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ జీవీ రవికుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న సురక్ష సర్వేపై ఆరాతీశారు. సచివాలయ సిబ్బంది వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని, ప్రజలకు అవసరమైన సేవలను గుర్తించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. అనంతరం జగనన్న సురక్ష ఆన్‌లైన్ రిపోర్టును, సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు.

పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్



తెర్లాం: నిరసన తెలియజేస్తున్న వలంటీర్లకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి



పవన్ డౌన్ డౌన్ అని నినాదాలు చేస్తున్న వలంటీర్లు



రామభద్రపురంలో నిరసన ర్యాలీ చేస్తున్న వలంటీర్లు



బాడంగిలో పవన్ కళ్యాణ్ ప్లకార్డులు చూపిస్తూ ఆందోళన చేస్తున్న వలంటీర్లు



మెంటాడ: పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు

జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ తీరుపై వలంటీర్లు మండిపడుతున్నారు. వారాహి యాత్రలో భాగంగా ఇటీవల ఏలూరులో జరిగిన బహిరంగ సభలో ఆయన వలంటీర్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీసింది. వలంటీర్లు హ్యూమన్ ట్రాఫికింగ్(మానవ అక్రమ రవాణా)కు పాల్పడుతున్నారని, ఒంటరి మహిళల డేటాను చోరీ చేసి, ఇతరులకు అందిస్తున్నారన్న ఆయన ఆరోపణలను ఖండిస్తూ ఆయన దిష్టిబొమ్మలు, వాల్‌పోస్టర్లను బుధవారం దహనం చేశారు. నిరసన ర్యాలీలు, మానవహారం చేపట్టి, పవన్ డౌన్ డౌన్.. ప్యాకేజీ స్టార్ ఖబడ్దార్.. దత్తపుత్రుడా ఒళ్లు దగ్గరపెట్టుకో.. అని నినాదాలు చేశారు. పోలీస్‌స్టేషన్లకు చేరుకుని, పవన్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్ బొబ్బిలి, మెంటాడ

సంక్షిప్తంగా...

శాకంబరి అలంకరణలో అమ్మవారు



రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ, జ్ఞాన సరస్వతిదేవి బుధవారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు శర్మ అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, ఈఓ శ్యామలరావు ఏర్పాట్లు చేశారు. రెండు రోజుల పాటు భక్తులకు దర్శనం కల్పించిన అనంతరం అమ్మవారిని అలంకరించిన కూరగాయలతో మహాన్నదానం చేయనున్నట్లు చెప్పారు.

ఆటపాటలతో బోధించాలి

వంగర: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజనీదుర్గ అన్నారు. మండలంలోని వంగర, రుషింగి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. చిన్నారులకు, గర్భిణులకు అందించే 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' పదార్థాల నిల్వలను పరిశీలించారు. వంటకాలు రుచిగా ఉండాలని, పాలు, గుడ్లు క్రమం తప్పకుండా అందించాలని కార్యకర్తలకు సూచించారు.

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారికి కేటాయించిన యునిక్ ఐడీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకున్న వారికి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 3న జరిగే కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8328584366, 8309438446కు సంప్రదించాలని కోరారు.

రూ.2 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో రూ.2 లక్షలతో సీసీ కాలువలు నిర్మాణం చేస్తున్నారు. ఈ పనులను గ్రామ సచివాలయ కన్వీనర్ గెడ్డాపు అప్పలనాయుడు, ఎంపీటీసీ కడగల రాంబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ..15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలోని గోరువీధి, కొర్లువీధి మధ్య 300 మీటర్లు పొడవున కాలువ నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. పీఆర్‌జేఈ ప్రభాకరరావు పనులను పర్యవేక్షిస్తున్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

వంగర: మండలంలోని ఇరువాడ పంచాయతీ చంద్రంపేట గ్రామంలో తాగునీటి బోర్లు మరమ్మతులు బుధవారం చేపట్టారు. సర్పంచ్ పెద్దిరెడ్డి విజయమ్మ ఆధ్వర్యంలో ప్రధాన వీధితో పాటు పలు వీధుల్లో పాడైన బోర్లను మెకానిక్ కళింగ కృపారావు బాగుచేశారు. బోర్లు బాగు అవడంతో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు సత్కారం

రాజాం సిటీ: పని చేసిన చోట అందించిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని ఎంఈఓ–2 వై.దుర్గారావు అన్నారు. మండలంలోని బొద్దాం ఎంపీపీ పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఎస్.పైడిరాజు, ఎస్.హరికృష్ణ, బి.గోవిందలను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వర్ణరాణి, ఉపాధ్యాయులు హైమావతి పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలి

బొబ్బిలి: స్థానిక ఇందిరమ్మ కాలనీలో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ పనులను త్వరితగతిన చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం ఆయన అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. కాలనీలో ఎటువంటి ఆక్రమణలు ఉన్నా సమాచారం ఇవ్వాలని కోరారు.

పౌష్టికాహార కిట్లు అందజేత

బొబ్బిలి: స్థానిక సీహెచ్‌సీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 100 మంది గర్భిణులకు పౌష్టికాహార కిట్లు బుధవారం అందజేశారు. మాతాశిశు ఆరోగ్యమే ప్రధానంగా రోటరీ క్లబ్ వీటిని అందజేసిందని సీహెచ్‌సీ వైద్యాధికారి జి.శశిభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు తూముల బంగారు రాణి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.